క్లుప్తంగా

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జైనూర్: ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆది వాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆది వాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ప్రతీ గూడెల నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ దినోత్సవ నిర్వహణ కమిటీ గౌరవ చైర్మన్ మెస్రం మోతిరాం, నాయకులు మడావి భీంరావు, మెస్రం భీంరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

కౌటాల: మండల కేంద్రంలోని భారతి విద్యా మందిర్ పాఠశాలలో శుక్రవారం అమ్మ శ్రీకాంత్ చారిటబుల్ ట్రస్ట్, బంధం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల కారస్పాండెంట్ దుర్గం గోపాల్, హెచ్ఎం సందీప్, ట్రస్ట్ సభ్యులు రాంటెంకి మమత, దొబ్బల మంగేష్ పాల్గొన్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన ఉపాధ్యాయులు



తరలివెళ్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: మండలంలోని పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి అభినందన సభకు తరలివెళ్లారు. కౌటాల మండలానికి చెందిన 25 మంది ఉపాధ్యాయులు, పోలీస్ ఎస్కార్ట్, వైద్య సిబ్బంది వెళ్లారు. కౌటాల, ముత్తంపేట్ హెచ్ఎంలు నారాయణ్‌సింగ్, గావుడే హన్మంతు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పర్యాటకులకు సౌక్యరాలు కల్పిస్తాం

తిర్యాణి: చింతలమాదర సందర్శన కోసం వచ్చే పర్యాటకుల కోసం సౌక్యరాలు కల్పించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం చింతలమాదర జలపాతం పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జలపాతం వద్ద ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయలేదని ప్రస్తుతం పోలీస్‌లతో పాటు ఫారెస్టు అధికారులు జలపాతం వద్దనే ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం లేదన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకుడు జువ్వాజీ అనిల్ గౌడ్, మాజీ సర్పంచ్ కోట్నాక గణపతి, ఏటీసీ చైర్మన్ తుంరం గోపాల్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



కొత్తపల్లి గణేశ్



పుర్క విలాస్

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి గణేశ్, ఉపాధ్యక్షుడిగా రామగిరి సరిత, పల్లూరి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా పుర్క విలాస్, కోశాధికారిగా చిలుకూరి ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కోవ విజయ్

ఆసిఫాబాద్: భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కోవ విజయ్ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

కూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద దివ్యాంగుడు

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరే వెంకటేశ్ అనే దివ్యాంగుడి ఇల్లు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. తన తల్లితో పాటు ఆ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఉదయం పూట ఇంట్లో ఎవరూ లేకపోవడం, వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేయాలని కోరుతున్నాడు.

రాకపోకలకు నరకయాతన

- వేంపల్లి రైల్వేగేటు వద్ద రోడ్డు గుంతలమయం
- అందుబాటులోకి రాని నూతన ఫ్లైఓవర్
- పనుల జాప్యంతో ప్రమాదాలు



నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్



వేంపల్లి రైల్వేగేటు వద్ద గుంతలమయంగా రోడ్డు

సిర్పూర్(టి): సిర్పూర్(టి)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో మండలంలోని వేంపల్లి రైల్వేగేటు వద్ద గేటుకు ఇరువైపులా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఏళ్ల తరబడిగా రైల్వేగేటు వద్ద వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. అయినా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సిర్పూర్(టి)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారి గుండా నిత్యం నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలాలతో పాటు మహారాష్ట్ర గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అంతేకాకుండా అంతర్రాష్ట్ర రహదారుల నుంచి భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు బాధలు వర్ణణాతీతం. గుంతలతో వాహనదారులు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

పూర్తికాని ఫ్లైఓవర్..

సిర్పూర్(టి)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని వేంపల్లి రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి 2016లో ఆర్అండ్‌బీ శాఖ తరఫున రూ. 13 కోట్ల రూపాయలు, రైల్వే శాఖ తరఫున రూ. 7 కోట్లు మంజూరయ్యాయి. మంజూరైనప్పటి నుంచి రెండు సంవత్సరాల గడువులోగా వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. ప్రారంభంలో అటవీశాఖ అనుమతులు రాలేదని పనులు నిలిపివేయగా తర్వాత బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. వంతెన పనులు ఎప్పుడు పూర్తి చేస్తారోనని నియోజకవర్గ ప్రజలు వేచి చూస్తున్నారు. వంతెన పనులు నత్తనడకన కొనసాగుతున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బంది



వేంపల్లి రైల్వేగేటు వద్ద గేటుకు ఇరువైపులా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలి.

– ఎర్రం మల్లేశ్, సిర్పూర్(టి), వ్యాన్ డ్రైవర్

అధికారులు స్పందించాలి



ఫ్లైఓవర్ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో ఏళ్లుగా రైల్వే గేటు వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. ఎలాంటి మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– ఎల్ములే కిషోర్, గంగాయిగూడ

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే



అధికారులను సన్మానిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది



సిబ్బందిని అభినందిస్తున్న డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్

జైనూర్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని జైనూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పార్వతీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జైనూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2015 నుంచి ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తించి ఎంతో మంది విద్యార్థుల ఉన్నతంగా రాణించడానికి ఆయన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మండాడి సోనేరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న రేంజ్ అధికారి అప్పలకొండతో పాటు అటవీసెక్షన్ బీట్ అధికారులు సత్యనారాయణ, మహేశ్, రవి, లక్ష్మణ్, భగవంత్‌రావ్, శ్రీనివాస్, స్వప్న, రజితలకు సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా అప్పలకొండ ఎంతో గొప్పగా పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సరోజారాణి, సెక్షన్ అధికారులు సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులకు సన్మానం

వాంకిడి: మండలంలోని ఫారెస్ట్ సెక్షన్ అధి కారులుగా పని చేసిన కోట్నాక లక్ష్మణ్, భగవంత్‌రావు, సత్యనారాయణ, బీట్ అధికారిగా పని చేసిన రజితలు బదిలీపై వెళ్తున్న సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారిని సరోజ రాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. దశాబ్ద కాలంగా మండలంలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అందించిన సేవలు, కృషిని కోనియాడారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో రామూర్తి, చెక్‌పోస్ట్ వాచర్లు నగేశ్, టీమాజీ, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఏవో వివేక్

జైనథ్: అర్హులైన ప్రతీ ఒక్క కుటుంబానికి రూ. 2లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల వ్యవసాయాధికారి వివేక్ అన్నారు. శుక్రవారం గిమ్మ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అధికారులతో సమావేశమయ్యారు. లక్ష వరకు 2049 మందికి, లక్ష యాభై వేల వరకు 1658 మంది రైతులకు రుణమాఫీ వర్తించిందన్నారు. కొన్ని బ్యాంకుల ద్వారా రైతుల సమాచారం సరిగా అందకపోవడంతో రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కానీ రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపిస్తున్నామన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: అసెంబ్లీ ఎన్నికల్లో ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడికందుల రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోదంపల్లిలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలో వచ్చిన 100 రోజుల్లో కులగణన చేసి, బీసీ కులాలకు న్యాయం చేస్తామని తెలిపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా.. ఎన్నికల హామీలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసిన వెంటనే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నిలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, శ్రీశైలం, శంకర్, శ్రీనివాస్, భీమక్క, పాల్గొన్నారు.

‘బూటకపు హామీలతో అధికారం’



మాట్లాడుతున్న గొల్లపల్లి వీరభద్ర చారి

బెజ్జూర్: బూటకపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కుమురం భీం జిల్లాలోని రెండు నియోజకవర్గాలలోని కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించే దిశగా పని చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానలు గెలిచి అద్భుత విజయం సాధించిందన్నారు. ఈ సమావేశంలో బెజ్జూర్ మండల మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ, కొండ్ర మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, కుమ్మరి తిరుపతి, తెలబాపు, మెస్రం రాజారాం, సామల తిరుపతి, అల్లూరి శోభ, మోహన్, వసీఖాన్, అన్నారం తిరుపతి, తొర్రెం తిరుపతి పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని శుక్రవారం సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణలు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి వర్షానికి కురుస్తున్న విషయాన్ని గుర్తించారు. గ్రంథాలయ భవనం పైకప్పు నుంచి వర్షానికి కురుస్తుందని, ఇబ్బంది పడుతున్నామని యువకులు తెలియజేయడంతో మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రంథాలయ భవనం లోపల, బయట నీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

కైరిగూడ కార్మికులకు ప్లేడేలు కల్పించాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ కార్మికులకు గతంలో కల్పించిన విధంగా ప్లేడేలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం కైరిగూడ ఓసీపీని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఓసీపీ మేనేజర్ ప్రవీణ్ పాటింగ్‌కు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సింగరేణి యాజమాన్యం కార్మికులకు అందచేసిన సీఎంపీఎఫ్ చిట్టీల్లో అవకతవకలు జరిగాయన్నారు. కార్మికులందరికీ ఇన్సెంటివ్ వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి భాస్కరాచారీ, నారాయణ, మాధవకృష్ణ, సంజీవరెడ్డి, శ్రీకాంత్, సూర్య నారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్, తిరుపతి, నరేందర్, శివకుమార్ పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

తక్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రతీ మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం శాసనసభలో క్రీడాకారులైన నిఖిత జరీన్, మహమ్మద్ సిరాజ్‌కు గ్రూప్– 1 ఉద్యోగాలు కల్పించే బిల్లుపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే ఒక స్పోర్ట్స్ పాలసీ తీసుకువస్తామన్నారు. ప్రతీ మండల కేంద్రంలో ఒక స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సీఐ, ఎస్సై



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

కౌటాల: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కౌటాల సీఐ సాధిక్ పాషా అన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా కౌటాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో 150 మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. చెట్లు అధికంగా ఉంటేనే పర్యావరణం పచ్చగా ఉండి ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కౌటాల ఎస్సై మధుకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలి

తిర్యాణి: గ్రామాలల్లో పచ్చదనం పెంపొందించాలని మండల ప్రత్యేకాధికారి రమాదేవి అన్నారు. ఈనెల 5 నుంచి నిర్వహించే స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాల్లో మొక్కలు నాటాలన్నారు. ఎంపీడీవో వేముల మల్లేశ్, డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఏపీవో షాకీర్ ఉస్సాని, ఏపీఎం సదానందం పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా సిబ్బందితో కలిసి 150 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

సిర్పూర్(టి): స్వచ్ఛదనం.. పచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెడికల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య, వైద్యాధికారి నవత, మెడికల్ ఆఫీసర్ శివ, తదితరులరు పాల్గొన్నారు.

కెరమెరి: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి లక్ష్మినారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 5 నుంచి 9వరకు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్, వ్యవసాయాధికారి గోపీకాంత్, డీటీ సంతోష్ కుమార్, విశ్వేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీశ్వర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నార్నూర్: వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పూసిగూడ, జాండా గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వై ద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్ దాస్, హెల్త్ అసిస్టెంట్ కై లాస్, చౌహన్ సింధు, సుజాత, రత్నాబాయి, రూప్‌దేవ్, దుర్గ పటేల్ పాల్గొన్నారు

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న బోగే ఉపేందర్

రెబ్బెన: ఎన్నికల సందర్భంగా వీవోఏలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఏఐటీయూసీ సమావేశంలో మండలానికి చెందిన వీవోఏలు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న వీవోఏల సేవలను ప్రభుత్వాలు గుర్తించటం లేదన్నారు. ప్రభుత్వాలు చాలీచాలనీ వేతనాలు అందిస్తున్నారని ఆరోపించారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు భీమేష్, గౌరవ అధ్యక్షుడు లింగన్న, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రవి, కృష్ణ, రజిత పాల్గొన్నారు.

బైక్ షోరూం కాదు.. ప్రభుత్వ ఆసుపత్రే



ఆసిఫాబాద్‌అర్బన్: ఈ ఫోటోలో కనిపిస్తున్న ఫొటో బైక్ షోరూం అనుకొంటే పొరపాటే.. అది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం రోగులు వచ్చే ప్రధాన దారి. శుక్రవారం కొందరూ బైక్‌లను పార్కింగ్ చేయడంతో రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణ లోపంతోనే ఇలా బైక్‌లను దారిలో పార్కింగ్ చేసినట్లు పేషంట్‌లు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

కైలాస్‌నగర్: తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులకు పీఆర్సీని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వ ద్ద ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు సీతక్క, జూపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వం రూ.24వేల వే తనం మాత్రమే చెల్లించేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందించాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సారధి కళాకారులు పాల్గొన్నారు.